నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
11 | హైదరాబాద్, సోమవారం 26 ఫిబ్రవరి 2024 | HYDERABAD

ఈ అంతస్తులకు అడ్డేలేదా..?

నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులకు అంతస్తులు | నోటీసులకే పరిమితం.. చర్యలు శూన్యం | టౌన్ ప్లానింగ్ పనితీరుపై తీవ్ర విమర్శలు | ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా.. బాధితులకు దక్కని భరోసా

అక్రమ కట్టడాలపై చర్యలేవి..?

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): 'అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలకు మించి నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం'..ఇది బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు, కమిషనర్ చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారు. ప్రమాదకరంగా నిర్మాణాలు జరుగుతున్నా.. బాధ్యతగా వ్యవహరించడం లేదు. అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు. కానీ అనుమతి పొందిన నిర్మాణదారుడు అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులతో చెలరేగిపోతున్నా..ఆ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప.. ఆపై చర్యలకు వెళ్లడం లేదు. ఇదే సమయంలో సదరు షోకాజ్ అందుకున్న నిర్మాణదారుడు డబ్బు లిస్తే చాలు ..కొందరు అధికారులు ఆ నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. అదేమని అడిగితే సరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదని స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు.

రహదారి ఆక్రమించి..

ప్రశాంత్‌హిల్స్‌లో సర్వే నంబర్ 66/2లో రహదారిని ఆక్రమించిన రిటైర్డ్ అధికారి భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. కాలనీ లే అవుట్‌లో సదరు నిర్మాణం జరిగే ప్రాంతం కాలనీ రహదారిగా స్పష్టంగా ఉన్నప్పటికీ దానికి ఆక్రమించి భవన నిర్మాణం కొనసాగిస్తున్నారు. కొందరు రెవెన్యూ విభాగం అధికారులను మచ్చిక చేసుకొని ఎన్‌వోసీని సంపాదించి.. దాని ఆధారంగా భవన నిర్మాణ అనుమతులు పొందారు. కాలనీకి చెందిన దారిని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారంటూ కాలనీకి చెందిన అల్లగడ్డ గుర్రప్ప జీహెచ్ ఎంసీ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తక్షణమే సదరు నిర్మాణాన్ని నిలిపివేయాలని, లేని పక్షంలో ప్రజలకు, కాలనీకి ఉపయోగపడాల్సిన రహదారులు కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎన్‌వోసీ ఆధారంగా తాము అనుమతులను మంజూరు చేస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతుండగా, ఆ అనుమతులన్నీ గతంలో పనిచేసిన అధికారులే ఇచ్చారంటూ.. ప్రస్తుత అధికారులు చెబుతున్నారు.

టౌన్‌ప్లానింగ్ పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి..

ఒక నిర్మాణం రాత్రి రాత్రే జరగదు. రోజుల తరబడి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా..ముడుపుల మత్తులో పడి నిబంధనలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు పాతర వేస్తున్నారు. పైగా నోటీసులు ఇచ్చిన నిర్మాణాల జోలికి కూడా వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారని, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. స్థానిక జీ+4 అంతస్తుల నిర్మాణాలే జరిగే చోట ఏడు, ఎనిమిది అంతస్తుల మేర అందులో ఎలాంటి కనీస సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదకర స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. సామాన్యుడు చిన్నగా సెట్‌బ్యాక్ ఉల్లంఘన జరిపితే చర్యలు తీసుకునే అధికారులు.. బడా నిర్మాణదారుల జోలికి మాత్రం వెళ్లడం లేదు. అక్రమ నిర్మాణాలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులకు మాత్రం భరోసా దక్కడం లేదు. కమిషనర్ రోనాల్డ్ రాస్ జోక్యం చేసుకొని అక్రమ నిర్మాణాలను నిగ్గు తేల్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నందిహిల్స్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా.. మీర్‌పేట కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ.. వివిధ కాలనీల వాసులు అదివారం రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. -బడంగ్‌పేట, ఫిబ్రవరి 25

3 అంతస్తులకు అనుమతి పొంది..

సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ సమీపంలోని ప్లాట్ నంబర్ 41లో 317 చదరపు గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాన్ని చేపట్టారు. జీహెచ్ఎంసీ నుంచి గ్రౌండ్ ప్లస్ 3 అంతస్తులకు అనుమతి పొందిన యజమాని, దానికి బదులుగా అక్కడ సెల్లార్‌తో పాటు నాలుగైదు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు అధికారులు క్షేత్ర స్థాయిలో పరీక్షించిన తర్వాత రూపొందించిన నివేదికలో పేర్కొన్నారు. బల్దియా నుంచి పొందిన అనుమతి వివరాలు (ప్లాన్) సైట్ వద్ద ప్రదర్శించాల్సి ఉన్నా, దాన్ని విస్మరించి అక్రమ భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గుర్తించారు. నిర్మాణ భవనం చుట్టూ 4 దిక్కులా ఉండాల్సిన సెట్ బ్యాక్‌లు సైతం ఉల్లంఘించి నిర్మిస్తున్నారు. భవనం ముందు వైపు 3 మీటర్లు సెట్ బ్యాక్ ఉండాల్సి ఉండగా, దానికి బదులుగా కేవలం 1.4 మీటర్ల స్థలాన్ని వదిలారు. ఇలా మూడు దిక్కులా సెట్ బ్యాక్ 2 మీటర్లు వదిలి పెట్టి నిర్మించాల్సి ఉన్నా, కేవలం ఒక మీటరు స్థలాన్ని వదిలి నిర్మించినట్లు జీహెచ్ఎంసీ సైట్ పరిశీలన చేసిన సమయంలో గుర్తించి యజమానికి ఫిబ్రవరి 8న నోటీసులు సైతం జారీ చేశారు. కానీ నేటికీ చర్యలు శూన్యం. అయితే సంబంధిత అధికారులకు భారీగా ముడుపులు అందినట్లు ప్రధాన ఆరోపణ. నిబంధనలకు విరుద్ధంగా అంతస్తుల మీద అంతస్తుల నిర్మాణం జరుగుతున్నా..పట్టించుకోవడం లేదు.

కూల్చివేతకు నోటీసులు ఇచ్చి..

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌హిల్స్‌లో సర్వే నంబర్ 66/2లో ప్లాట్ నంబర్ 175/పార్ట్‌లో ఒక ప్లాట్‌పై అనుమతులు తీసుకొని.. పక్కనే ఉన్న మరో ప్లాట్‌ను కలుపుకొని సదరు నిర్మాణదారుడి అక్రమ నిర్మాణాన్ని చేపట్టారు. అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. స్థానిక నివాసితులు గాయత్రి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు అక్రమ నిర్మాణమని తేల్చి ఇప్పటికే సదరు నిర్మాణ సంస్థకు రెండు సార్లు కూల్చివేతకు సంబంధించి నోటీసు (నం. 1758/యూసీ/2023) జారీ చేశారు. ఓ జెడ్పీ తన అధికారాన్ని అడ్డు పెట్టుకొని నిర్మాణం కూల్చేందుకు వెళ్లిన బృందాన్ని సైతం వెనక్కి పంపించేశారు. ఫలితంగా అక్రమ నిర్మాణం పూర్తి చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్‌కు అద్దెకు ఇచ్చేందుకు యజమాని సిద్ధమవుతున్నాడు.

లాస్యనందిత కుటుంబానికి అండగా ఉంటాం: కేటీఆర్

దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని ఆదివారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డితో కలిసి కార్ఖానాలోని ఆమె నివాసానికి వెళ్లిన కేటీఆర్.. లాస్యనందిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె తల్లి, సోదరిని ఓదార్చారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మరణించారన్న వార్త విని షాక్‌కు గురయ్యానని చెప్పారు. విదేశాల్లో ఉండటం వల్ల ఆమె అంత్యక్రియలకు హాజరు కాలేపోయానని తెలిపారు. లాస్యనందిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాలరాజు తదితరులు ఉన్నారు.

- కంటోన్మెంట్, ఫిబ్రవరి 25

బస్సుల కోసం ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. సర్వీసులు తక్కువ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఆటోలను ఆశ్రయిస్తూ..గమ్యస్థానానికి చేరుతున్నారు.

ఫిబ్రవరిలో పీక్

గణనీయంగా పెరిగిన విద్యుత్ డిమాండ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మండుతున్న ఎండలతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచే రికార్డు స్థాయిలో ఎండల తీవ్రత ఉండటంతో అదే స్థాయిలో విద్యుత్ వినియోగం గ్రేటర్ పరిధిలో పెరిగింది. ఈనెల 8న 65 మిలియన్ల యూనిట్ల వినియోగం జరగ్గా, అదే సమయంలో గతేడాది ఫిబ్రవరి 55 మిలియన్ యూనిట్లకు మించలేదు. దీంతో ఏడాది ఫిబ్రవరి నుంచి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నదని అధికారులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గతేడాదితో పోల్చుకుంటే జనవరిలో 9.47 శాతం, ఫిబ్రవరిలో 12.27 శాతం అధిక వినియోగం నమోదైందని తెలిపారు. 2023 ఫిబ్రవరిలో గరిష్ఠ విద్యుత్ డిమాండు 2930 మెగా వాట్లు ఉండగా, 2024 ఫిబ్రవరి 23వ తేదీ నాటికి 3174 మెగావాట్లు నమోదైంది. ఏటా వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతూనే ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి వేసవి డిమాండును తట్టుకునేలా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకొని అవసరమైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డీటీఆర్‌లు, కొత్త లైన్లను ఏర్పాటు చేసే పనిలో విద్యుత్ యంత్రాంగం నిమగ్నమైంది.

ఒక్కో అకౌంట్‌కు లక్ష

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఒక్కో బ్యాంకు అకౌంట్‌కు లక్ష రూపాయల కమీషన్ తీసుకుంటూ సైబర్‌నేరగాళ్లకు ఇండియన్ బ్యాంకు ఖాతాలు అందిస్తున్న వ్యక్తిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అదనపు సీపీ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో నగరానికి చెందిన ఒక వ్యక్తికి రూ. 2,38,405లను మోసం చేయడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ ఎన్.నరేశ్ నేతృత్వంలోని బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. నిందితుడు మహ్మద్ సోయాబ్ బాబ్లు ఖాన్ సైబర్‌నేరగాళ్లతో చేతులు కలిపాడు. బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును డిపాజిట్ చేయించేందుకు సైబర్ నేరగాళ్లకు కావాల్సిన బ్యాంకు ఖాతాలు అందిస్తున్నాడు. ఇందుకు ఒక్కో ఖాతాకు లక్ష రూపాయలు తీసుకుంటున్నాడు. ఈ వ్యవహారంలో బాధితుడు వేసిన సొమ్ము సోయాబ్ బాబ్లు ఖాన్ ఖాతాలోనూ డిపాజిట్ అయినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి ఖాతాలో ఉన్న రూ. 5 లక్షలు సీజ్ చేశారు. నిందితుడికి దేశ వ్యాప్తంగా 42 కేసులతో సంబంధాలుండగా.. తెలంగాణలో ఆరు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బూతులు తిట్టి..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: రద్దీరోడ్డుపై రాంగ్‌రూట్‌లో రావడమే కాదు.. అడ్డుకున్న ట్రాఫిక్ హోంగార్డుపై అనుచిత వ్యాఖ్యలు చేసి.. దాడి చేసిన మహిళపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్‌కు చెందిన హోంగార్డు విష్ణోష్ శనివారం రాత్రి రోడ్ నం. 12లోని అగ్రసేన్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఓ మహిళ తన కారులో రాంగ్‌రూట్‌లో వేగంగా దూసుకు వస్తుండడాన్ని గమనించిన హోంగార్డు విష్ణోష్ ఆపారు. రద్దీ రూట్లో రాంగ్‌రూట్‌లో కారు వస్తే ప్రమాదాలు జరుగుతాయని, కారును వెనక్కి తిప్పాలని సూచించారు. అయితే రాంగ్‌రూట్‌లో వెళ్లినందుకు తన కారు ఫొటోలు తీసుకుని చలానా వేసుకోవాలని, తాను మాత్రం ముందుకే వెళ్తానంటూ కారులోని మహిళ వాగ్వాదానికి దిగింది.

అయితే కారును ముందుకు వెళ్లనిచ్చేది లేదంటూ విష్ణోష్ చెప్పడంతో రెచ్చిపోయిన మహిళ.. కారులోంచి బయటకు దిగి తీవ్రపదజాలంతోదూషించడంతో పాటు దాడి చేసి లైఫ్ జాకెట్‌ను చింపేసి మొబైల్ ఫోన్‌ను పగలగొట్టింది. బాధితుడు విష్ణోష్ ఇచ్చిన ఫిర్యాదుతో నిందితురాలిపై ఐపీసీ 332, 353, 427, 504, 279తో పాటు పీడీపీపీ యాక్ట్, ఎంవీ యాక్ట్స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సర్కారు స్థలాలు గుర్తించి..

గూగుల్ మ్యాపింగ్



మేడ్చల్, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, సీలింగ్ భూముల గూగుల్ మ్యాపింగ్‌ను రెవెన్యూ యంత్రాంగం సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న సర్కారు స్థలాలను గుర్తించి గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాల్లోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో 5,196 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ప్రభుత్వ ఖాళీ భూముల వివరాల గూగుల్ మ్యాప్‌ను తయారు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం గూగుల్ మ్యాప్‌ను చేసేందుకు చర్యలు చేపట్టింది. గతంలోనే జిల్లాలో ప్రభుత్వ భూములను అధికారులు గుర్తించారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మరోసారి గుర్తించి వాటి సంరక్షణకు గూగుల్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. కాగా, ప్రస్తుతం ప్రభుత్వ సంరక్షణలో ఎంత భూమి ఉందన్న విషయాన్ని రెవెన్యూ అధికారులు తేల్చనున్నారు. మేడ్చల్ జిల్లాలోని రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉప్పల్ మండలంలో 333 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113, మేడ్చల్ 37, బాలనగర్ మండలంలో 700, శామీర్‌పేట్ మండలంలో 420, దుండిగల్ (గండిమైసమ్మ) మండలంలో 425, మేడిపల్లి మండలంలో 900, ఘట్‌కేసర్ మండలంలో 500, కాప్రా మండలంలో 400, కీసర మండలంలో 417, కుత్బుల్లాపూర్ మండలంలో 600, బాచ్‌పల్లి మండలంలో 360 ఎకరాలు ఉన్నాయి. ఈ లెక్కల ప్రకారం భూముల గుర్తింపు అనంతరం గూగుల్ మ్యాపింగ్ సిద్ధం కానున్నది.

అధిగమించాల్సిన సవాళ్లెన్నో..!

మెట్రో రెండో దశ డీపీఆర్ రూపకల్పనలో ఎదురవుతున్న క్లిష్ట పరిస్థితులు

- ఒకే చోట రెండంతస్తుల పై ఓవర్లు
- ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్ల కూడళ్లలో పరీక్షగా మారిన నిర్మాణం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రెండో దశ మెట్రో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు సవాళ్లు ఎదురవుతున్నాయి. నిత్యం ట్రాఫిక్‌తో నిండి ఉండే నగరంలో మెట్రో కారిడార్ల నిర్మాణం అధికారులకు ఒక పరీక్షగా మారింది. ప్రధానంగా నాగోల్ నుంచి ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్డు మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు నిర్మిస్తున్న కారిడార్‌లో పలు చోట్ల మెట్రో పిల్లర్లతో పాటు స్టేషన్ల నిర్మాణం పెద్ద సవాలుగా మారిందని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం డీపీఆర్‌ను రూపొందించేందుకు హైదరాబాద్ మెట్రో అధికారులతో పాటు రెండు కన్సల్టెన్సీ సంస్థలు క్షేత్ర స్థాయిలో పలు అంశాల్లో అధ్యయనం చేస్తున్నాయి. నిర్ణయించిన కారిడార్‌లో మెట్రో స్టేషన్ల నిర్మాణం ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలంటే క్షేత్ర స్థాయిలోని పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. నగరానికి ఇన్నర్ రింగు రోడ్డుగా ఉన్న ఈ మార్గంలో అడుగడుగునా సవాళ్లు ఎదురవుతున్నాయి. పెరిగిన రద్దీకి తోడు ఇతర నిర్మాణాలు, భూగర్భంలో మంచినీరు, డ్రైనేజీ లైన్లు, విద్యుత్, టెలీ కమ్యూనికేషన్స్ వంటి మౌలిక వసతులకు సంబంధించినవి ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొంటూ.. సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను రూపొందించడం సంక్లిష్టంగా మారిందని మెట్రో అధికారులు చెబుతున్నారు.

రెండు లెవల్స్‌లో పై ఓవర్లు

మెట్రో రెండో దశలో అత్యంత పొడవైన కారిడార్‌గా ఉన్న నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో పలు చోట్ల పై ఓవర్లు ఉన్నాయి. నాగోల్, కామినేని, ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్డు, ఓవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో రోడ్డు మధ్యలోనే పై ఓవర్లు ఉన్నాయి. దీంతో మెట్రో కారిడార్‌ను రోడ్డు మధ్యలో కాకుండా ఒక వైపు నుంచి నిర్మించాల్సిన పరిస్థితి ఉన్నదని గుర్తించారు. ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్డు వద్ద పై ఓవర్ల పక్క నుంచి కాకుండా అడ్డంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి మెట్రో వయా డక్ట్‌ను వాటిపై నుంచి నిర్మించాల్సి ఉన్నది. ఈ ఫైఓవర్లు ఇప్పటికే ఎత్తు 20-25 అడుగుల ఎత్తులో ఉన్నాయి. దీంతో ఒక్కసారిగా మెట్రో పిల్లర్ల ఎత్తు, వాటిపై వయాడక్ట్‌లను మరింత ఎత్తులో నిర్మించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి ఎల్బీనగర్ చౌరస్తాలో ఉంటే... 350 మీటర్ల దూరంలోనే మరో పై ఓవర్ సాగర్ రింగు రోడ్డులో అడ్డుగా ఉంది. ఇది రెండో లెవల్ పై ఓవర్‌గా ఉండటంతో మరింత ఎత్తులో మెట్రో కారిడార్‌ను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. వీటికితోడు ఈ రెండు చౌరస్తాల్లో ప్రయాణికుల కోసం మెట్రో స్టేషన్లను నిర్మించాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడే మెట్రో అధికారులు ఒక పరీక్షగా మారింది. అత్యంత ఎత్తులో మెట్రో మార్గాన్ని నిర్మించడంతో పాటు అదే ప్రాంతంలో రెండు మెట్రో స్టేషన్లను నిర్మించాలన్న దానిపైనే అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఇంజినీరింగ్ పరంగా తమకు పెద్ద సవాలుగా మారిందని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు.

మార్చి చివరి నాటికి డీపీఆర్...

మెట్రో రెండో దశ డీపీఆర్‌ను త్వరగానే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో రెండు వేర్వేరు కన్సల్టెన్సీలతో హైదరాబాద్ మెట్రో అధికారులు క్షేత్ర స్థాయిలో పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. 70 కి.మీ మెట్రో మార్గంలో ఒకేసారి డీపీఆర్ రూపకల్పనకు ఆవసరమైన పనులు కన్సల్టెన్సీలు చేస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రెండో దశ మెట్రోకు శంకుస్థాపన చేసి, మార్చి చివరి నాటికి డీపీఆర్ సిద్ధం చేసేలా చూడాలని మెట్రో అధికారులకు సర్కారు సూచించింది. దీంతో శరవేగంగా రెండో దశకు సంబంధించిన కారిడార్లలో డీపీఆర్‌కు అవసరమైన అంశాలను అధ్యయనం చేస్తున్నారు. మొత్తంగా మెట్రో రెండో దశ పనులు వేగంగా సాగుతుండగా, ఇంజినీర్లకు కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటికి సులభమైన పద్ధతులను అన్వేషించే పనిలో ఉన్నారు.

మాకు మెట్రో కావాల్సిందే..

సుచిత్ర చౌరస్తాలో ఆందోళన చేస్తున్న మెట్రో సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్: పారడైస్ నుంచి బోయిన్‌పల్లి మీదుగా సుచిత్ర-కొంపల్లి-మేడ్చల్ వరకు మెట్రో రైలును ఏర్పాటు చేయాలంటూ.. మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో కొన్ని రోజుల నుంచి వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులోభాగంగా ఆదివారం సుచిత్ర చౌరస్తాలో జాతీయ రహదారి-44పై ఆందోళన చేపట్టారు. వీరి నిరసనకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి మద్దతు తెలిపారు.